క్లుప్తంగా

జాతీయ రహదారి పరిశీలన



గోపాలపురంలో హైవేను పరిశీలిస్తున్న అధికారులు

గోపాలపురం: దేవరపల్లి నుంచి జీలుగుమిల్లి వరకూ 516డి జాతీయ రహదారిని మంగళవారం మోర్తటీం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ జి.సంజీవనాయుడు మాట్లాడుతూ దేవరపల్లి నుంచి జీలుగుమిల్లి వరకూ 56 కి.మీ. రూ.150 కోట్లతో నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి మోర్తటీం సభ్యులు పరిశీలించినట్టు చెప్పారు. వీరి వెంట డిప్యూటీ ఈఈ ఎం.శ్రీనివాస్, ఏఈ కె.ఉష ఉన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

దేవరపల్లి: గోపాలపురం మండలం వాదాలకుంటలో మంగళవారం దేవరపల్లి ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. దాడుల్లో 12 మద్యం సీసాలతో వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

చీకటిపడినా చైతన్యవంతంగా..

- దాదాపు అర్ధరాత్రి వరకూ పోలింగ్
- గోపాలపురంలో మొత్తం 86.67 శాతం
- పోలైన ఓట్లు 2,10,399
- ఓటేసిన పురుషులు 1,04,831 మంది
- మహిళలు 1,05,564 మంది

దేవరపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. నియోజకవర్గంలో సోమవారం అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఓటర్లు కూడా ఓటేసే వెళతామన్న పట్టుదలతో అర్ధరాత్రి వరకూ పోలింగ్ కేంద్రాల్లో బారులుతీరి వేచిఉండడం కనిపించింది. గోపాలపురం నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాతంగా ముగియడంతో అధికారులు, పోటీల్లో ఉన్న అభ్యర్థులు, నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.

దేవరపల్లి మండల పరిషత్ పాఠశాల(మెయిన్)లో ఏర్పాటు చేసిన 60వ పోలింగ్ బూత్‌లో రాత్రి 10.30 వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గోపాలపురం మండలం రాంపాలెం, జగన్నాథపురం, భీమోలు గ్రామాల్లో రాత్రి 10.15 వరకు పోలింగ్ జరిగింది. ఈవీఎం యంత్రాలు నెమ్మదించడం, ఉదయం కొద్దిసేపు సాంకేతిక కారణాలతో పనిచేయకపోవడంతో పాటు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. ఉదయం 11 గంటల వరకు కేవలం 23 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి పోలింగ్ ఊపందుకుంది. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్య ఏర్పడడం వల్ల పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోవడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి బారులుతీరాల్సి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 12 గంటలకు ఈవీఎం యంత్రాలను పోలింగ్ అధికారులు రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు పోలీసు బందోబస్తు నడుమ తరలించి భద్రపర్చారు.



దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు

నమోదైన ఓట్ల వివరాలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 248 పోలింగ్ కేంద్రాల్లో 86.67 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 2,42,761 మంది ఓటర్లు ఉండగా, ఈవీఎంల ద్వారా 2,06,594 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1,577 ఓట్లు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మొత్తం 2,10,399 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు ఎక్కువ మంది ఉన్నారు. పురుషులు 1,04,831 మంది, స్త్రీలు 1,05,564 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో గోపాలపురం నియోజకవర్గంలో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. పురుషుల కంటే స్త్రీలు 733 మంది అదనంగా ఓటు వేశారు.

పోలింగ్ సరళి ఇలా..

ఉదయం 7 గంటల నుంచి జరిగిన పోలింగ్ సరళి ఈ విధంగా ఉంది. ఉదయం 9 గంటలకు 8.72 శాతం, 11 గంటలకు 23.88, మధ్యాహ్నం ఒంటి గంటకు 34.43, మూడు గంటలకు 56.24, ఐదు గంటలకు 70.14, రాత్రి 9 గంటలకు 80.93, 10 గంటలకు 86.03 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 86.62 శాతం ఓట్లు నమోదయ్యాయి.

అధ్యాపకుడు వీరకృష్ణకు డాక్టరేట్



నల్లజర్ల: ఏకేఆర్జీ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగంలో అధ్యాపకుడిగా పని చేస్తున్న మంచాల వీరకృష్ణకు కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయం వారు మేనేజ్‌మెంట్ సబ్జెక్ట్‌లో డాక్టరేట్ ప్రదానం చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో మెటీరియల్ మేనేజ్‌మెంట్‌లో రిస్క్ అనాలసిస్ అనే పరిశోధన వ్యాసం సమర్పించినందుకు తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్టు వీరకృష్ణ తెలిపారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కంభంపాటి సాంబశివరావు పర్యవేక్షణలో ఈ పరిశోధన వ్యాసం పూర్తి చేసినట్టు చెప్పారు. డాక్టరేట్ పొందిన వీరకృష్ణకు ఏకేఆర్జీ విద్యాసంస్థల కరస్పాండెంట్ చావా గోకుల్, సెక్రటరీ వడ్లమూడి రామారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వట్టికూటి శివరామ్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

మహిళలదే పైచేయి..

- నియోజకవర్గంలో ఓటేసిన 1,58,176 మంది
- పోలింగ్ 85.69 శాతం నమోదు

కొవ్వూరు/తాళ్లపూడి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కొవ్వూరు నియోజకవర్గంలో 85.69 శాతం నమోదైంది. ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓట్లు వేశారు. నియోజకవర్గంలో 1,84,136 మంది ఓటర్లు ఉండగా, 1,58,176 మంది ఓటు వేశారు. వీరిలో 89,743 మంది పురుషులు గాను 77,991 మంది, 94,388 మంది మహిళా ఓటర్లకు గాను 80,182 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. పురుషుల కంటే 2191 మంది స్త్రీలు అదనంగా ఓటు వేశారు. ఇందులో థర్డ్ జండర్ ముగ్గురున్నారు. తాళ్లపూడి మండలంలో 41,873 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 20,514, మహిళా ఓటర్లు 21,358 మంది ఉన్నారు. ఇందులో 18,124 మంది పురుషులు, 18,574 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 87.64 శాతం నమోదైంది.

ఫలితాలపై ఉత్కంఠగా..

సార్వత్రిక ఎన్నికల ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలావుంటే ఫలితాల కోసం ప్రతి ఒక్కరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. గత రెండు నెలలుగా అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు క్షణం తీరిక లేకుండా ప్రచారాలు చేస్తూ, ఓటర్లను కలుసుకునే పనిలో బిజీగా గడిపారు. పోలింగ్ ముగియడంతో పాటు, ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. వచ్చే నెల నాలుగున పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇంకా 20 రోజులు ఉండడంతో, ఏచోట నలుగురు కలిసినా ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారు, ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో అంటూ చర్చలు సాగుతున్నాయి. దీంతోపాటు భారీ స్థాయిలో బెట్టింగ్‌లు కాసేందుకు సైతం పలువురు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. మండలంలో వైఎస్సార్ సీపీ వైపే ప్రజలు మొగ్గుచూపినట్టు తెలుస్తోంది. ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన మహిళలు, యువత, రైతులు, వృద్ధులు ఈ పార్టీకి బలపర్చినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పోటీ వైఎస్సార్ సీపీ, టీడీపీల మధ్యే నెలకొంది. మొదటి నుంచీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ప్రచారంలో ముందంజలో ఉండి ఓటర్లను ఆకట్టుకున్నారు. దీంతో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరోసారి విజయకేతనం ఎగురవేస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

బెట్టింగ్‌ల జోరు



- ఎన్నికల ఫలితాలపై రూ.కోట్లలో పందాలు
- వైఎస్సార్ సీపీ గెలుపుపైనే భారీ ఆశలు

దేవరపల్లి: సార్వత్రిక ఎన్నికల పక్రియ ముగియడంతో ప్రధాన పార్టీలకు చెందిన నేతలు మండలాల వారీగా కూడికలు, తీసివేతల పనిలో నిమగ్నమయ్యారు. ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నారు. ఓటమి తప్పదని తెలిసినప్పటికీ టీడీపీ నేతలు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుపై, గోపాలపురం నియోజకవర్గంలో గెలుపుపై ప్రధాన పార్టీలు వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు బెట్టింగ్‌లు వేస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచి గోపాలపురం నియోజకవర్గంలో బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, గోపాలపురంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనిత విజయం సాధిస్తారని ఆ పార్టీ నాయకులు బెట్టింగ్‌లు వేస్తున్నారు. పొలాలు, ఇంటి స్థలాలపై కూడా పందాలు కాస్తున్నారు. గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నట్టు సమాచారం. ఇప్పటికే దాదాపు రూ.50 కోట్ల వరకు బెట్టింగ్ జరిగినట్టు తెలిసింది. ఓట్ల లెక్కింపునకు మరొక 20 రోజుల సమయం ఉండడంతో బెట్టింగ్‌లు మరింత జోరందుకునే అవకాశం ఉంది. నియోజకవర్గంతో పాటు, పరిసర మండలాల నాయకులు కూడా గోపాలపురం విజయంపై జోరుగా బెట్టింగ్‌లు వేస్తున్నారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ కూటమి అభ్యర్థులపై 1:2 నిష్పత్తిలో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. అభ్యర్థులపైనే కాకుండా రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. రూ.10 లక్షల నుంచి కోటి వరకు బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో 86.10 శాతం పోలింగ్ జరగడం, మహిళలు ఎక్కువ శాతం ఓటు హక్కు వినియోగించుకోవడంతో విజయంపై ఇరు పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. నియోజకవర్గంలో తీర్పును బీసీలు నిర్ణయించబోతున్నారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. బీసీలు ఎటువైపు మొగ్గు చూపితే ఆ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారని పలువురు నాయకులు అంటున్నారు.

ఓటెత్తిన మహిళా లోకం

- నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 80.31 శాతం పోలింగ్
- మొత్తం ఓటర్లు 2,13,396, పోలైన ఓట్లు 1,71,377
- వైఎస్సార్ సీపీకే అనుకూలమని విశ్లేషకుల అంచనా

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ రికార్డు స్థాయిలో జరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ నిర్ణీత గడువు దాటాక కూడా కొనసాగింది. ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. మండుటెండలో క్యూలో ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ జరిగింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటరు తీర్పు రాజమహేంద్రవరం నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రంగా ఉంది.

పోటీపడ్డ మహిళలు

నియోజకవర్గంలో నిడదవోలు అర్బన్, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో మొత్తం 2,13,396 మంది ఓటర్లు ఉండగా, 1,71,377 ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ 80.31 శాతం నమోదైంది. ప్రతి బూత్‌లో ఓటెయ్యడానికి మహిళలు పోటీ పడ్డారు. అధిక శాతం మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవడంతో ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వారందరూ వైఎస్సార్ సీపీకి సానుకూలంగా ఉన్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పోలింగ్ సరళిపై లెక్కలు

నియోజకవర్గ వ్యాప్తంగా కీలక నాయకుల నుంచి క్షేత్ర స్థాయి నాయకుల వరకు, రాజకీయ విశ్లేషకులు ఎవరికి వారు ఓటింగ్ సరళిపై కూడికలు, తీసివేతల్లో నిమగ్నమయ్యారు. వార్డులు, బూత్‌లు, పోలింగ్ స్టేషన్ల వారీగా, గ్రామాలు, మండలాల వారీగా, కులాలు, సామాజిక వర్గాల వారీగా, కింది నుంచి పైదాక లెక్కలు కట్టడంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు లెక్కల్లో మునిగిపోయారు. నిడదవోలు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడంతో, ఏ బూత్‌లో ఎన్ని ఓట్లకు ఎన్ని పోలయ్యాయి. ఆ బూత్‌లో ఆయా సామాజిక వర్గాల వారి ఓట్లు ఎన్ని ఉన్నాయి. వారు ఎవరికి ఓటేశారనే అనే అంశాలపై బేరీజు వేస్తున్నారు. ఈసారి కూడా ఎవరికి అనుకూలంగా మహిళా ఓటర్లు పట్టం కట్టారనే కోణంలో లెక్కలు వేస్తున్నారు.



పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు

ఎవరి ధీమా వారిది

నిడదవోలు నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీల వారు విజయం మాదంటే, మాదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు రంగంలో ఉండగా, వైఎస్సార్ సీపీ, జనసేన మధ్య పోటీ నెలకొంది. విజయంపై రెండు పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. నిడదవోలు పట్టణం, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో అన్ని సామాజిక వర్గాల నుంచి మంచి పట్టు ఉందని, అత్యధిక మెజార్టీ సాధిస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమాతో ఉన్నారు. కూటమి నాయకులు సైతం విజయం తమదేనని లెక్కలు వేసుకుంటున్నారు. ఇదిలాఉండగా ఎన్నికల సరళిని బట్టి నిడదవోలు పట్టణం, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో వైఎస్సార్ సీపీకి స్పష్టమైన మెజార్టీ లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో ఈ పార్టీ అభ్యర్థి జి.శ్రీనివాసనాయుడు విజయం తథ్యమని వారు లెక్కలు కడుతున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీల జయాపజయాలపై పందెం రాయుళ్లు పందాలు సైతం మొదలెట్టారు.

అకాల వర్షం.. స్తంభించిన జన జీవనం

- మామిడి రైతులకు మిగిల్చిన నష్టం
- జలమయమైన రహదారులు, ప్రజల ఇక్కట్లు
- విద్యుత్ సరఫరాకు కలిగిన అంతరాయం

గోపాలపురం: పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. వీధులు జలమయం కాగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని పంటలకు నష్టం వాటిల్లింది. మంగళవారం కురిసిన ఈదురు గాలులు, భారీ వర్షానికి మండలంలోని దొండపూడి, గోపవరం, వాదాలకుంట, భీమోలు గ్రామాల్లో ఉన్న మామిడి కాయలు రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లినట్టు రైతులు తెలిపారు.ఈ ఏడాది దిగుబడి అంతంతమాత్రంగా ఉందని, ఈ నెలలో రెండు సార్లు ఈదురు గాలులకు పంట మొత్తం రాలిపోయిందని చెప్పారు. మార్కెట్ కూడా ఆశాజనకంగా లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు తెలిపారు. ఈదురు గాలులకు సుమారు రెండు గంటల పాటు విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒకవైపు వడగాడ్పులతో కూడిన ఎండలు, మరోవైపు వర్షంతో ప్రజలు కాస్తంత సేదతీరారు. మండలంలోని వాదాలకుంట, గోపాలపురం, వెదుళ్లకుంట గ్రామాల్లో భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలలతో భారీ వర్షం పడింది. దాదాపు రెండు గంటలసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దాళ్వా వరి, మొక్కజొన్న పంటలు రైతులు పూర్తిచేయడంతో ఎటువంటి ఇబ్బంది కలగలేదు. లేతగా వేసిన మొక్కజొన్న అక్కడక్కడా దెబ్బతింది. ఉద్యాన పంటలకు, కూరగాయల సాగుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. నిన్నటి వరకు వేసవి అధిక ఉష్ణోగ్రతలతో సతమతమైన చిన్నారులు, వృద్ధులకు ఊరట లభించింది. పలు గ్రామాల్లో రహదారులపై వర్షం నీరు నిలబడింది.

జనానికి ఊరట

తాళ్లపూడి: మండలంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండలను తాళలేక ఇబ్బంది పడ్డ జనానికి కాస్తంత ఊరట లభించింది. ఉదయం నుంచి ఎండ మండిపోగా, సాయంత్రం 3.30 సమయంలో వాతావరణంలో ఒక్క సారిగా మారిపోయింది. ఈదురు గాలులు, ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురవడంతో తాళ్లపూడిలోని బజార్ సెంటర్ జలమయమైంది. మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



తాళ్లపూడిలో భారీ వర్షానికి జలమయమైన రోడ్డు



దేవరపల్లిలో జోరుగా కురుస్తున్న వర్షం



గోపాలపురం మండలం వాదాకుంటలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

మెట్ట పంటలకు మేలు

దేవరపల్లి: కొవ్వూరు డివిజన్‌లోని మూడు నియోజకవర్గాల్లోని మెట్ట ప్రాంతంలో మంగళవారం జోరువాన కురిసింది. సాయంత్రం 4 గంటల నుంచి వర్షం దిమ్మరపోయడంతో వాతావరణం చల్లబడింది. చల్లని ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు సేదతీరారు. ఈ నెలలో ఇప్పటికీ మూడు సార్లు వర్షాలు కురవడం వల్ల నేల తడిచి వేడి గాలులు తగ్గాయి. ఈ వర్షాలు మెట్ట పంటలకు మేలు చేసినట్టు రైతులు తెలిపారు. నీటి తడులు అందక ఎండిపోతున్న పంటలు వర్షాలతో కోలుకున్నాయి. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో వర్షం కురిసింది. కొన్నిచోట్ల రహదారులు వర్షపు నీటితో జలమయం అయ్యాయి.

స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలు భద్రం

- ఆర్వో వెంకటరమణ నాయక్

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం నిడదవోలు అసెంబ్లీ పరిధిలోని ఈవీఎంలను నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్, అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ అనంతరం కేంద్ర బలగాల రక్షణలో స్ట్రాంగ్ రూంలో భద్ర పరిచినట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నిడదవోలు ఆర్వో ఆర్.వెంకటరమణ నాయక్ తెలిపారు. మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం నన్నయ యూనివర్సిటీ ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎం యూనిట్లను భద్రపరిచి, గదులకు సీల్ వేసినట్టు చెప్పారు. ఈవీఎంల్లో పోలైన ఓట్లు, ఫారం 17ఎ రిజిస్టర్, పీవో డైరీ 17సి అనుసరించి స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించామన్నారు. వీటన్నింటికీ పరిశీలకుడు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత నియోజకవర్గాల పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల అభ్యర్థుల సమక్షంలోనే సీల్ వేసినట్టు తెలిపారు. నిడదవోలు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2,13,396 మంది ఓటర్లు ఉండగా, ఈవీఎంల ద్వారా 1,71,377 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1,509 ఓట్లు, ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ద్వారా 411 ఓట్లతో కలిపి మొత్తం 1,920 మంది ఉద్యోగుల ఓట్లు నమోదయ్యాయి.



నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎం యూనిట్లను భద్రపరిచి, గదికి సీల్ వేస్తున్న ఎన్నికల అధికారులు